మినీ కథ

# సుబ్బారావు-కుక్కపిల్ల

ఆఫీసరుగారి గదిలోకి భయం భయంగా అడుగుపెట్టిన సుబ్బారావు "పిలిచారా!" అన్నాడు భయంగానే. "ఆఁ. బావోయ్! రాకూర్చో" ఆఫీసరుగారి మర్యాదకు ఆశ్చర్యపోయాడు సుబ్బారావు. ఆ రోజు అరగంట ఆలస్యంగా వచ్చినందుకు పిలిపించాడేమోనని భయం భయంగా వస్తే, చిరునవ్వుతో ఆహ్వానిస్తున్న ఆఫీసరుగారిని చూచేసరికి అది కలయో వైష్ణవ మాయయో అనిపించిందతనికి.

"ఏమోయ్ సుబ్బారావ్! నీకు కుక్కపిల్లలంటే ఇష్టమేనా?" సుబ్బారావుకి ఏం సమాధానం చెప్పాలో తోచలేదు. ఆఫీసరుగారు ఏ వుద్దేశ్యంతో అడుగుతున్నారో! ఇష్టమేనంటే ఒక తప్పు, కాదంటే ఒక తప్పు. ఏం చెప్పాలో తోచేలోగానే ఆఫీసరుగారు మళ్ళీ అందుకున్నారు. "ఏం లేదోయ్! మా కుక్క ఆరు పిల్లల్ని పెట్టింది. అవన్నీ నాకనవసరం. అందుకని మన స్టాఫ్‌కి వాటిని ఇవ్వదలిచాను. ఇష్టమైతే నీకూ ఒకటి ఇద్దామని అంతే"

సుబ్బారావు గుండెల్లో పిడుగు పడినట్టయింది. ఉన్న పిల్లలతోటే వేగలేక ఛస్తుంటే ఇదొకటి కూడానా! కానీ ఇష్టంలేదని చెప్పేస్తే ఫ్యూచర్ ఏమయిపోతుందో! కళ్ళముందు ఒక్కసారి తన కుటుంబ పరిస్థితి కదలాడినా, ఆఫీసరుగారిని చూసేసరికి మొహమాట పడిపోయాడు సుబ్బారావు. ఆరోజే అతనింట్లో మరోపిల్ల చోటుచేసుకుంది.

సుబ్బారావు కుక్కపిల్లతో యమయాతన పడిపోతున్నాడు. చూడ్డానికి అందంగానే వుంది-కానీ బుద్ధులే బజారుపాలయ్యాయి. అడ్డమైనవీ తిని వచ్చి అన్నింటిలోనూ మూతి పెడుతుంటే చూస్తూ వూరుకోలేక ఏమీ చెయ్యలేకపోతున్నాడు. కుక్కను చూస్తాను తీసుకరమ్మని ఆఫీసరుగారు ఏక్షణాన అంటారోనని ఇష్టంలేకపోయినా దానిని తన పిల్లలకంటే మిన్నగా చూసుకుంటున్నాడు. అయినా దాన్ని పెంచడం అతనికి చేతకాలేదు. అసలే చాదస్తుడు. అందులోనూ మధ్యతరగతి కుటుంబీకుడు. అతని దగ్గర మాంసం ముక్కలెలా దొరుకుతాయి. కుక్కపిల్ల రోజురోజుకీ చిక్కిపోసాగింది. దాని నీరసం చూస్తుంటే సుబ్బారావుకి నీరసం వచ్చేసింది.

సుబ్బారావు ఊహించినట్లే ఉన్నట్టుండి ఒకరోజు ఆఫీసరుగారు కుక్కపిల్లను చూడాలి తీసుకురమ్మన్నారు. సుబ్బారావు గొంతులో పచ్చివెలక్కాయ పడినట్లయింది. బక్కచిక్కిపోయిన కుక్కపిల్లను చూసి ఆఫీసరుగారేమంటారోననే బెంగతో బాధపడిపోయాడు. సుబ్బారావు భార్య అతని పరిస్థితికి జాలిపడి ధైర్యం చెప్పింది.

**బలిజేపల్లి**

## మీరు నిరుద్యోగులా !

అయితే మీ పేరు మా Society లో Register చేసుకోండి. Clerks, Typists, I. T. I. Technicians, Technical Courses చేతిపనులు, ఇతర విద్యావంతులకు, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో ఉద్యోగ వివరాలు, అవకాశాలు ఎప్పటికప్పుడు మ ద్వారా తెలుసుకొని ప్రయోజనం పొందండి. అప్లికేషన్‌తో వివరాలకు రు. 2/- M O. చేయండి.

## మీరు చిన్న ఉద్యోగులా !

మా సంస్థ ద్వారా మంచి Sales Asst: కండి. మాచే Supply చేయబడు Soaps, Detergents, Face Powder, Shampoo వంటి పలురకములైన నిత్యావసర సరకులను మీద్వారా Sales చేసి 15 To 25% వరకు కమిషన్ పొందండి. మా Society అన్ని ఏర్పాట్లు చేస్తుంది. అప్లికేషన్‌తో పూర్తి వివరములకు రు. 3/- M. O. చేయండి.

## మీకు అందుబాటులో ఉద్యోగం

S S. C. వరకు చదివినా చాలు. B. Com., M. Com అక్కర లేదు. 2 నెలల్లో Practical Accountancy నేర్చుకోండి. Sales Tax, Income Tax లెక్కలు వ్రాసేందుకు Certificate ఇవ్వబడును. మీ ప్రాంతములోని చిన్న కంపెనీలలోను, Shop ల లోను Accounts వ్రాయండి. అప్లికేషన్ ఫారములతో వివరాలకు రు. 1-50 M. O. చేయండి.

I. T. E. SOCIETY,
Post Box No. 2263.
MADRAS-600 026.




హఠాత్తుగా ఆఫీసరుగారు ఊరువెళ్ళవలసి రావడంతో ఆ రోజుకి సుబ్బారావు గండం గట్టెక్కింది. వారం రోజుల తర్వాత ఆఫీసరుగారు మళ్ళీ కుక్క ప్రస్తావన తెచ్చారు. ఈ సారి సుబ్బారావు గొంతులో పచ్చివెలక్కాయ బదులు పంచదార పాకం పడింది. భార్య చెప్పిన సలహా అతనికి ఏనుగంత బలాన్నిచ్చింది. ఈ దెబ్బతో కుక్కకీ, తనకీ రుణం తీరిపోతుందనుకున్నాడు. సంతోషంతో ఈలవేసుకుంటూ కుక్కపిల్లతో ఆఫీసరుగారింటికి వెళ్ళాడు.

"ఏమిటోయ్ సుబ్బారావ్! తెనాలి రామలింగడి పిల్లిపిల్లలా తయరుచేశావ్ కుక్కపిల్లనీ!?"

"లేదుసార్! మొన్నటిదాకా బాగా బలంగానే వుండేది. మొన్నటిరోజు మీ దగ్గరకి తీసుకు వస్తానని చెప్తే చెంగుచెంగున గంతులు కూడా వేసింది సార్! కానీ ఆ తర్వాత మీరు లేకపోవడంవల్ల తీసుకు రావడం మానేస్తే బెంగతో ఇలా అయిపోయిందాసార్! మీరంటే దీనికింకా ఎంత విశ్వాసమో చూడండి సార్!" అన్నాడు సుబ్బారావు తనలో తాను సంబరపడిపోతూ.

"అలాగటోయ్! నీ మాటలు అర్థం చేసుకునేలా పెంచావన్నమాట. నాకు తెలుసు సుబ్బారావ్ నువ్వంతటి సమర్థుడవనీ! వెధవది ఇన్ని కుక్కల్ని పెంచాను కానీ ఒక్క దానికీ అర్థంచేసుకునే ట్రయినింగు ఇవ్వలేక పోయాను. అందుకే ఇది నా దగ్గరకంటే నీ దగ్గరే బాగావుంటుంది. తీసుకుపో" తనంటే అంతటి విశ్వాసమున్న కుక్కపిల్లని తనకే వదిలేసి వెళ్ళమంటారనుకున్న ఆఫీసరుగారిమాటలు వినేసరికి అవాక్కయిపోయాడు పాపం! సుబ్బారావు.

★